క్లుప్తంగా

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

వేమూరు: రైతులకు యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి చందోలు సునీత అన్నారు. అమర్తలూరు మండలంలోని జంపని రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె సాయిల్ హెల్త్ కార్డు ద్వారా ఎరువులు వాడడం వల్ల ఉపయోగాలను వివరించారు. రైతులంతా మట్టి నమూనా తీసి ల్యాబ్‌కి పంపి భూమిలో పోషకాలను తెలుసుకోవాలని ఆమె సూచించారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రంలో తెలియజేయాలని ఆమె కోరారు. రెవెన్యూ శాఖ ద్వారా కౌలు రైతులంతా కార్డులు పొందాలని తెలిపారు. కౌలు కార్డు ఉండటం వల్ల వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలను పొందవచ్చని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి మహాలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

విద్యా కిట్లు పారదర్శకంగా పంపిణీ చేయాలి

శావల్యాపురం: ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పారదర్శకంగా పంపిణీ చేయాలని స్టేట్ నోడల్ అధికారి ఎస్.గీత తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యా కిట్ల నిల్వల్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 39 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. 2,243 మంది విద్యార్థులకు గానూ బ్యాగ్స్-2,243, బెల్ట్‌లు-1,579, నోట్ పుస్తకాలు -12,834, పాఠ్య పుస్తకాలు -10,651 వచ్చాయని చెప్పారు. పాఠశాలల తెరిచే నాటికి ప్రతి విద్యార్థికి కిట్లు అందేలా క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించాలని ఆమె తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో కిట్లు తడవకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా నోడల్ అధికారి వనజ, జిల్లా సీఎంవో పద్మారావు, సీఆర్పీలు ఎలికా శ్రీనివాసరావు, రావూరి శివప్రసాద్, కట్టా ఏడుకొండల, ఐఆర్పీ కె.జగన్‌మోహన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది లింగాల శ్రీహరి, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

చెరుకుపల్లి: మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. వాహనం 500మీటర్లు పైగా ఈడ్చుకెళ్లడంతో మృతదేహం చెరుకుపల్లి పంచాయతీ కార్యాలయ సమీపంలో పడిపోయింది. అవయవాలు నుజ్జునుజ్జు అయ్యి గుర్తుపట్టలేని విధంగా ఉంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం రేపల్లె ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మహిళ వివరాల కోసం జాతీయ రహదారి పక్కనే ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



చందోలు(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండలం చందోలు సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఓ గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం పడి ఉన్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానిక వీఆర్వో అరుణ ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వి.శివకుమార్ యాదవ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని ఎస్ఐ వివరించారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం



రేపల్లె: స్థానిక గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 45 రోజులుగా చిన్నారులకు నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. బ్యాడ్మింటన్, స్కేటింగ్, డ్యాన్స్ విభాగాల్లో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఉమామహేశ్వరరావు పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. వైద్యుడు సురేంద్రనాథ్, ఎంసీఏ సభ్యులు బాపారావు, పి.శ్రీనివాసరావు, ఎస్.రమేష్, హనుమంతరావు, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనంతా నయవంచన

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ ఈవూరు గణేష్
- వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యే
- ఆయన బాటలోనే కూటమి నేతలు పచ్చ విషం కక్కుతున్నారు
- ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయి



ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, నాయకులు



నిరసనను సాగనివ్వాలని చేతిలెత్తి పోలీసులను మొక్కుతున్న అశోక్‌బాబు

రేపల్లె: కూటమి ప్రభుత్వ పాలనంతా నయవంచనని, సాక్షాత్తూ ప్రజలే మండిపడుతున్నారని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పేర్కొన్నారు. కూటమి నాయకులు ప్రభుత్వ పగ్గాలు చేపట్టి సంవత్సరం నిండినా ప్రజలకు చేసిందేమీలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినోత్సవంలో భాగంగా రేపల్లె పట్టణంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కల్లబొల్లి కబుర్లు చెప్పడం, ఇచ్చిన మాటలు తప్పడం, నయవంచన చేయడం టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యేనని ధ్వజమెత్తారు. నాడు పిల్లనిచ్చిన మామకు వెన్నుపొడవడం అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నికల ముందు గద్దెనెక్కేందుకు కల్లబొల్లి వాగ్దానాలు చేసి, పగ్గాలు చేపట్టాక నేడు ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని తెలిపారు. ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిన ఘనుడు చంద్రబాబు అని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌లు రెడ్ బుక్ అంటూ తమ సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు అంతా గమనిస్తూనే ఉన్నారని, కచ్చితంగా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమవుతుందని దుయ్యబట్టారు. కూటమి పాలనలో రైతులు, నేతన్నతలో పాటు అన్ని వర్గాల ప్రజలు అట్టుడికిపోతున్నారని, అసంతృప్తిగా విసిగివేసారిపోతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ నుంచి రాజ్యలక్ష్మి థియేటర్, మున్సిపల్ కార్యాలయం, నెహ్రూ బొమ్మ సెంటరు మీదగా ఆర్డీవో కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతులకు ఏడాదికి రూ.20వేలు అటకెక్కినట్టేనా.. ఏటా జాబ్ క్యాలెండర్ ఏమైంది బాబు.. కొత్త పెన్షన్‌లు ఎప్పుడు ఇస్తారు.. పంటలకు గిట్టుబాటు ధర ఎక్కడా..? అప్పులన్నీ అమరావతికేనా.. హామీలు అమలు కావా.. కూటమి పాలనలో అన్నీ కష్టాలే.. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం ఎక్కడా ? అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించేలా నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో నేలపు రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, లేనిపక్షంలో గద్దెను దిగిపోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంటరీ సమన్వయకర్త తూమాటి మాధవరావు, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకట రామిరెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ వెంకట రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, నాయకులు చిత్రాల ఓబేదు, చిమటా బాలాజీ,బొర్రా శ్రీనివాసరావు, పట్టెం శ్రీనివాసరావు, సముద్రాల ప్రభుకిరణ్, నిజాంపట్నం కోటేశ్వరరావు, సబ్బా పద్మావతి, శారద పాల్గొన్నారు.



అశోక్‌బాబును అడ్డుకుంటున్న రేపల్లె డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు



మొసలిపాడు వద్ద తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అశోక్‌బాబు

'వెన్నుపోటు దినం'ను అడ్డుకునేందుకు పోలీసుల పహారా

కొల్లూరు : ప్రజా క్షేత్రంలో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన అబద్ధపు హామీల బాగోతం బట్టబయలు అవనీయకుండా కూటమి ప్రభుత్వం ఖాకీ వలయంతో అడ్డుకునేందుకు కుటిలయత్నానికి పాల్పడింది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు తలొగ్గిన ఖాకీలు ఏకంగా ఓ గ్రామాన్నే దిగ్బంధించారు. వైఎస్సార్ సీపీ తలపెట్టిన వెన్నుపోటు ర్యాలీని జరగనీయకుండా అడ్డుకునేందుకు అడుగడుగునా అడ్డుకున్నారు. డీఎస్పీ సహా, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు కలుపుకొని సుమారు 30 మందికి పైగా పోలీసులతో ఖాకీ వలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని కొనసాగనివ్వాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు మొక్కినా కనికరం చూపలేదు.

అశోక్‌బాబుకు స్వల్ప అస్వస్థత

అర కిలోమీటరు దూరంలో ఉన్న రేపల్లె -తెనాలి రోడ్డుపైకి చేరుకోవడానికి పోలీసుల అడ్డంకులు, ఇరు పక్షాల వాగ్వాదాలు, తోపులాటల కారణంగా రెండు గంటల సమయం పట్టింది. ఎర్రటి ఎండలో అశోక్‌బాబుతో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు మలమల మాడుతూ నిలిచిపోయారు. రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలో బైఠాయించి పోలీసుల తీరుపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ సమయంలో ఎండ వేడిమికి గురైన అశోక్‌బాబు స్వల్ప అస్వస్థతకు గురై, కొద్దిసేపటికి తేరుకున్నారు. ఓ వైపు డీఎస్పీ సిబ్బందితో నిరసన ప్రదర్శనను ముందుకు కదలకుండా అటకాయించారు. కొల్లూరు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లును మొసలిపాడుకు తీసుకొచ్చి వరికూటి అశోక్‌బాబుతో వినతిపత్రం ఇప్పించేందుకు ప్రయత్నించారు. అయితే, అక్కడ చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను గమనించిన తహసీల్దార్ కొద్దిసేపు వేచి చూసి అక్కడ నుంచి వెళ్లిపోయారు. చివరకు మూడు గంటలపాటు జరిగిన ఉద్రిక్త పరిస్థితుల అనంతరం మండల మెజిస్ట్రేట్ స్థాయి కలిగిన తహసీల్దార్‌ను పోలీసులు ఒంటి గంట ప్రాంతంలో తిరిగి మొసలిపాడు పిలిపించడంతో ఆయనకు అశోక్‌బాబు వినతిపత్రాన్ని అందజేసి నిరసనను విరమించారు.

ఖాకీల వలయంతో కూటమి కుటిల యత్నం

కొల్లూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన వెన్నుపోటు దినోత్సవం కార్యక్రమంలో భాగంగా కొల్లూరులో చేపట్టనున్న నిరసన ప్రదర్శన జరగకుండా పోలీసులు మండలంలోని మొసలిపాడులో అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్న వైనాన్ని ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపేందుకు ఏర్పాటు చేసిన శకటాలను ముందుకు కదలనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల అమలు విషయంలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రభుత్వం చేతిలో వెన్నుపోటుకు గురై ఘోరంగా మోసపోతున్న ప్రజల గొంతుకుగా వైఎస్సార్ సీపీ ముందుకు వస్తే నిరసన ప్రదర్శనను జరగకుండా పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలను మోసగించడంలో ఆరితేరిన సీఎం చంద్రబాబు ప్రపంచంలోనే నెంబర్ వన్ వెన్నుపోటుదారుడుగా నిలుస్తారనడంలో అతిశయోక్తి లేదని ఆయన ఎద్దేవా చేశారు. మహిళల అదృశ్యంపై గొంతు చించుకున్న డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, అదృశ్యాలపై ఇప్పటివరకు ఏమి చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు సుగ్గున మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, దాది వెంకట సుబ్బారావు, హేమచంద్ర శ్రీనివాస్, అన్నపరెడ్డి రఘురామరెడ్డి, చుండూరు ఎంపీపీ జాలాది రూబేన్, ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు చందోలు డేవిడ్ విజయకుమార్, పెరికల పద్మారావు, కోగంటి లవకుమార్, బొల్లిముంత ఏడుకొండలు, కూచిపూడి మోషే, గాజుల భానుప్రకాష్, చిలకా ప్రకాష్, దాట్ల మోహన్‌రెడ్డి, కూచిపూడి మోషే, గాదె శివరామకృష్ణారెడ్డి, రాపర్ల నరేంద్ర, యన్నం సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండు గీయించుకుని నిరసన



నిరసన తెలియజేస్తున్న రామయ్య

బాపట్ల: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య గుండు గీయించుకుని నిరసన తెలియజేశారు. వెన్నుపోటు దినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోన రఘుపతి ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలో బుధవారం భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా రామయ్య మాట్లాడుతూ ఇంటింటి సంక్షేమం అంటూ ప్రజలను నమ్మించి మోసం చేసిన చంద్రబాబునాయుడుకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పేరోజులు దగ్గరలోనే ఉన్నాయని దుయ్యబట్టారు. దివ్యాంగుల పెన్షన్లు తొలగించేందుకు కూడా ప్రభుత్వం విచారణల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. ఇప్పటికైనా పేద ప్రజలను ఆదుకునేందుకు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రామయ్య డిమాండ్ చేశారు.

వెన్నుపోటు చంద్రబాబునాయుడు నైజం

- వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కోన ధ్వజం
- ప్రజలకు వెన్నుదన్నుగా ఉంటాం



బాపట్లలో జరిగిన భారీ ప్రదర్శనలో కోన రఘుపతి, నాయకులు

బాపట్ల: వెన్నుపోటు చంద్రబాబునాయుడుకు కొత్తేమి కాదని వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కోన రఘుపతి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం సందర్భంగా బుధవారం పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. వైఎస్సార్ సీపీ జెండాలు, చంద్రబాబునాయుడు ప్రజలకు చేసిన మోసాలకు సంబంధించిన హామీల కరపత్రాలను నేతలు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ షేక్ సలీమాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను కూటమి ప్రభుత్వం చేపడుతుందని దుయ్యబట్టారు. కనిపించినవారందరికి "నీకు రూ.15వేలు..నీకు రూ..15వేలు..ఆడవారికి రూ.18వేలు" అంటూ జపం చేసిన చంద్రబాబునాయుడు ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. ఒక్క ఏడాదిలోనే 4.50లక్షల మంది పెన్షన్లను ఏడాదిలోనే తొలగించడం దారుణమైన విషయంగా కోన పేర్కొన్నారు. వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు వారందరినీ రోడ్డున పడేశాడని గుర్తు చేశారు. నాడు-నేడు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆసరా వంటి పథకాలతో పాటు రైతులను ఆదుకునేందుకు రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సంక్షేమ రాజ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు మరలా కోరుకుంటున్నారని తెలిపారు.మద్యం షాపుల గురించి మాట్లాడే హక్కు చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి లేదని చెప్పారు. మద్యం తాగాలంటేనే భయం పుట్టేలా జగన్‌మోహన్‌రెడ్డి చేస్తే ఇప్పుడు బెల్టు షాపులను ఏర్పాటు చేసి మరీ ఏరులై పారేవిధంగా చేశారని తెలిపారు. మరోవైపు పవన్ కల్యాణ్ తనకు వచ్చే వాటిని బ్యాగుల్లో సర్దుకుంటున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్‌ను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ ప్రజల పక్షం ఉంటుందని కోన చెప్పారు. ప్రభుత్వం పథకాలను అమలు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలోని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోన డిమాండ్ చేశారు.రోడ్డు విస్తరణ సందర్భంగా తొలగించిన కోన ప్రభాకరరావు, పొట్టి శ్రీరాములు విగ్రహం, ప్రకాశం పంతులు విగ్రహాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, షేక్ సయ్యద్ పీర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, చల్లా రామయ్య, కొక్కిలిగడ్డ చెంచయ్య, వడ్డిముక్కల డేవిడ్, గంగిశెట్టి రత్తయ్య, జోగి రాజా, కోటిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, చింతల రాజశేఖర్, వేల్పుల మీరాబి, లక్ష్మీరాఘవ, గొర్రుముచ్చు పుష్పరాజ్యం పాల్గొన్నారు.

కూటమి పాలన పచ్చి మోసం

ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు



మాట్లాడుతున్న మాధవరావు

రేపల్లె: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నయవంచనకు గురి చేసిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంటరీ సమన్వయకర్త తూమాటి మాధవరావు ఆరోపించారు. రేపల్లెలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు కంటీమిన్నగా అందిస్తామని కలబొల్లి మాటలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసగించారని ధ్వజమెత్తారు. సంవత్సర కాలంలో ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని తెలిపారు. నేడు ఖజానా ఖాళీ అంటూ కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించేందుకే తామున్నామంటూ పదేపదే గొప్పలు చెప్పుకునే జనసేన అధినేత, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు సంక్రాంతి, దీపావళి పండుగలు జరుపుకోవాలని ఆయన ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని, ముఖ్యంగా కార్మిక,రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని చెప్పారు. నిరుద్యోగ భృతిపై ఎంతమందిని గుర్తించారు అని అసెంబ్లీలో ప్రశ్నిస్తే అసలు భృతి ఇచ్చేది లేదంటూ ఆ శాఖ మంత్రి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం సిగ్గుచేటని ఖండించారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పి భూస్థాపితం చేస్తారని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ తదితరులున్నారు.

భారీగా తరలివచ్చిన శ్రేణులు



డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి బయలుదేరిన పార్టీ శ్రేణులు

కొల్లూరు: వైఎస్సార్ సీపీ తలపెట్టిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని కొల్లూరులో చేపట్టేందుకు ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సమాయత్తమయ్యారు. తెనాలి - రేపల్లె రోడ్డులోని కొల్లూరు ఊరు చివర పెట్రోలు బంకల ప్రాంతం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులతో ప్రదర్శనగా రెవెన్యూ కార్యాలయానికి తరలివెళ్లి, వినతిపత్రం అందించేందుకు సమయాత్తమయ్యారు.అయితే, కార్యకర్తలు ఆకలితో అలమటించరాదన్న ఉద్దేశంతో మండలంలోని మొసలిపాడులో చేపట్టిన భోజన ఏర్పాట్లు పరిశీలించేందుకు అశోక్‌బాబు తొలుత అక్కడకు చేరుకున్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేయని హామీలను, పథకాలను ప్రజల ముందకు తీసుకు వెళ్లేందుకు ఫ్లెక్సీలతో వాహనాలను సిద్ధం చేశారు. పోలీసులు వాటిని అడ్డుకోవడంతో అశోక్‌బాబుతో పాటు పార్టీ శ్రేణులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. రేపల్లె డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు, వేమూరు, చుండూరు సీఐలు పి.వి.ఆంజనేయులు, శ్రీనివాసరావుతో పాటు కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, అమృతలూరు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సైతం మొసలిపాడు చేరుకొని ర్యాలీని అడ్డుకున్నారు. అశోక్‌బాబును ముందుకు కదలకుండా అడ్డుగోడలా నిలిచారు. పోలీసులు, వైఎస్సార్ సీపీ శ్రేణుల నడుమ తోపులాటలు చోటు చేసుకున్నాయి

చెరుకుపల్లిలో..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన సంత్సర కాలంలో పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు అందరిని వెన్నుపోటు పొడిచిన ఘనుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని రేపల్లె నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరు గణేష్ విమర్శించారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ ఈవూరి గణేష్ గుళ్లపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి కార్యకర్తలు, నాయకులతో రేపల్లె తరలి వెళ్లారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన సంవత్సర కాలం పూర్తి అయినా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపైనే కక్ష కట్టి వారిపై దాడులు చేస్తూ తప్పుడు కేసులు పెటిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు వంగరు భాను, లుక్కా బాపనియ్య పాల్గొన్నారు.